క్లుప్తంగా

షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం



బాన్సువాడ : బాన్సువాడ కోట దుర్గమ్మ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కురుపాటి మమత–యోగేశ్వర్ దంపతులు శనివారం రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. ఆలయం వద్ద పూజ పీఠం కోసం త్వరలో నిర్మించే షెడ్డుకు విరాళం అందజేసిన యోగేశ్వర్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆలయానికి రూ.లక్షా 80 వేలు..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో నిర్మిస్తున్న వీరహనుమాన్ ఆలయ నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ భూంగారి రాము శనివారం రూ.లక్షా 80 వేల విరాళాన్ని అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందించిన రామును గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలకు బ్యాండు బహూకరణ



ఎల్లారెడ్డిరూరల్: రేపల్లెవాడ గ్రామ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ముత్యాలు శనివారం బ్యాండును విరాళంగా బహూకరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్చ్ పాస్ట్ నేర్చుకునేందుకు బ్యాండును అందజేసినట్లు ముత్యాలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ సాయిరాం ఉన్నారు.

ఆర్థిక సహాయం

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ గ్రామానికి చెందిన ఉల్లెంగ సాయవ్వ మూడు రోజుల క్రితం మరణించింది. దీనితో గ్రామ ప్రజలు అందరు వాట్సప్ గ్రూపు ద్వారా నగదును పోగు చేసి శనివారం ఆమె కుమారుడు కిరణ్‌కు అందజేశారు. గ్రామంలో ఎవరి కుటుంబ సభ్యులు మరణించినా కూడా నగదు అందిస్తామని, అందులో భాగంగానే రూ.13,100 అందించామన్నారు. నేతలు యూసుఫ్, మల్లేష్, సాయిలు, భూమయ్య, సంగయ్య, గంగారాం పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్'కు ఎంపిక



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విక్టర్ పాల్, మీనాక్షి రూపొందించిన ప్రాజెక్టు, ఎస్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్' తొలిదశకు ఎంపికైంది. గణిత ఉపాధ్యాయురాలు భవాని మార్గదర్శకత్వంలో రూపొందించిన ప్రాజెక్టును శనివారం గూగుల్ మీట్ ద్వారా ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధులకు విద్యార్థులు వివరించారని, తుది దశలో ఎంపికైన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ. 50 వేలు ప్రోత్సాహక నిధి అందజేయనుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ తెలిపారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేశ్ శని వా రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశా రు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యల పై చర్చించినట్లు తెలిపారు. గత నెలలో కురిసి న భారీ వర్షాల కారణంగా ఏర్పడిన భారీ నష్టా న్ని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. అ నంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన వెంట టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూల్‌సింగ్ ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : అక్కంపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను శనివారం అధికారులు పరిష్కరించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి గురించి 'సాక్షి' దిన పత్రికలలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్‌రెడ్డి, నా గిరెడ్డిపేట ఎంపీడీవో లలితకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ గ్రామా న్ని సందర్శించారు. సింగిల్ ఫేజ్ మోటార్లకు విద్యుత్ క నెక్షన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చారు. వారి వెంట ఎంపీవో ప్రభాకర్ చారి, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తదితరులున్నారు.

ఫుట్‌పాత్ నిర్మాణానికి మోక్షమెన్నడో?

- ఏడేళ్ల కిత్రమే రూ.2 కోట్లతో పనులకు శంకుస్థాపన
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని బల్దియా అధికారులు



కామారెడ్డి బస్టాండ్ ముందు శంకుస్థాపన వేసిన శిలాఫలకం



బస్టాండ్ ముందు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో కొత్త బస్టాండ్ నుంచి హౌసింగ్ బోర్డు పాత జాతీయ రహదారికి ఇరువైపులా మురికి కాలువతో పాటు, ఫుట్ పాత్ ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేసింది. ఏడేళ్ల క్రితమే పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు ఆ పనుల ఊసే లేదు. మురికికాలువ, ఫుట్‌పాత్ అభివృద్ధి పనులకు టుఫిడ్‌కో నిధులు రూ. 2 కోట్లతో 28, జులై 2018న శంకుస్థాపన చేశారు. ఓ మాజీ చైర్‌పర్సన్ భర్తనే ఆ కాంట్రాక్ట్ పనులను దక్కించుకుని పనులు ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా కొత్త బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు మాత్రమే మురికి కాలువ నిర్మాణ పనులు చేసి నిలిపేశారు. ఇంకా ఫుట్ పాత్ పనులను ప్రారంభించలేదు. ఏడేళ్ల దాటి పనులు నిలిచినా మున్సిపల్, ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఆక్రమణలు.. వ్యాపారాలు

పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలతో వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. మురికి కాలువ నిర్మాణం లేక వర్షపు నీరు రోడ్లపైన నిలిచిపోతున్నాయి. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వ్యాపారులు రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే రోడ్డు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులపాలవుతున్నారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించి మురికి కాలువ, ఫుట్‌పాత్ నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యతో పాటు అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి వివరణ కోరగా.. పూర్తి స్థాయిలో నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఈ పెండింగ్ పనులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిచి, పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు.

ప్రపంచానికి మన సంస్కృతి ఆదర్శం



లింగుపల్లిలో మాట్లాడుతున్న జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకారిణి సాయినాథ్

దోమకొండ: ప్రపంచానికి భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు ఆదర్శంగా ఉన్నాయని జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకారిణి సాయినాథ్ అన్నారు. శనివారం లింగుపల్లిలో విజయదశమి ఉత్సవం నిర్వహించి మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తిచేసుకుందని, హిందువులను సంఘటితం చేసే పనిలో భాగంగా సంఘ శాఖను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందువులు ఏకతాటిపైకి వస్తే హిందూ దేశం సంస్కృతి, సాంప్రదాయాలు, ధర్మం నిలబడగలుగుతాయన్నారు. గ్రామ, దేశ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని వివరించారు. ఖండ కార్యవాహ కదిరె లక్ష్మారెడ్డి, కదిరె మోహన్‌రెడ్డి, ఇందూర్ విభాగ్ గ్రామ వికాస్ సంయోజక్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండల కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్, భరతమాత చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం, ఆశయాల గురించి అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన కత్తిసాము, కర్రసాము ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు డీవీ. చలపతి, బోండుగుల సంతోష్, సందుగారి రవీందర్‌రెడ్డి, గొల్ల రమేష్, పబ్బ కిరణ్, పబ్బ రమేష్, తమ్మలి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'హిందువులందరూ ఏకం కావాలి'

కామారెడ్డి అర్బన్: కులాలుగా విడిపోకుండా హిందువులందరూ ఏకం కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహ బౌద్ధి ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం ఉదయం స్థానిక అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో విజయదశమి ఉత్సవం నిర్వహించగా యోగాచార్యులు గరపల్లి అంజయ్య గుప్తా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వక్తగా వెంకట శివకుమార్ హాజరై ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ పంచ పరివర్తనను ప్రతి హిందువు పాటించాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ సంచాలక్ బి.శంకర్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎ.నిత్యానందం, నగర కార్యవహ కె.శివరాజు, బస్తీ ప్రముఖ్ పబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు

స.హ. చట్టం వార్షికోత్సవాలు విజయవంతం చేయాలి



చింతమాన్‌పల్లిలో మాట్లాడుతున్న స.హ. చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం

దోమకొండ: నేటి నుంచి ఈ నెల 12 వరకు నిర్వహించే సమాచార హక్కు చట్టం(స.హ.చట్టం) వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని చట్టం రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. శనివారం చింతమాన్‌పల్లిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం–2005 పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు ఉంటాయన్నారు. జాతీయ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు దీనిపై ప్రత్యేక లేఖను జిల్లా కలెక్టర్‌లకు పంపించారన్నారు. దీంట్లో భాగంగా కమిటీ కామారెడ్డి జిల్లా ప్రతినిధులు.. ఆయా జిల్లా, మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను జాగృతం చేయాలన్నారు. కమిటీ రాష్ట్ర సలహాదారులు రమణారెడ్డి, శ్రీనివాసరావు, కామారెడ్డి జిల్లా కార్యదర్శి ముహమ్మద్ జావిద్, ప్రతినిధులు శ్రీనివాస్ రాజు, లింగమయ్య, అన్వర్ పాల్గొన్నారు.

సొంత డబ్బుతో రోడ్డు బాగు



రోడ్డు వేయిస్తున్న అశోక్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి) : లొంకల్‌పల్లి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ లింగారెడ్డిగారి వెంకట కిషోర్ రెడ్డి తన సొంత డబ్బులతో రోడ్డు బాగుచేయించారు. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి శెట్పల్లిసంగారెడ్డి నుంచి లొంకల్‌పల్లి మీదుగా నాగిరెడ్డిపేటకు వెళ్లే బీటీ రోడ్డు వరద నీటితో కొట్టుకుపోయింది. దాంతో ప్రయాణికుల రాకపోకలను ఇబ్బందిగా మారింది. దసరా పండగ సందర్భంగా స్వగ్రామం వచ్చిన ఎన్‌ఆర్‌ఐ వెంకటకిషోర్‌రెడ్డికి విషయం తెలిసి సుమారు రూ. 30 వేలు ఖర్చు చేసి రోడ్డుపై మొరం వేయించి రాకపోకలను పునరుద్ధరించారు. ఆయన తండ్రి అశోక్‌రెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

డైవర్షన్ రోడ్డు పనుల పరిశీలన

- పనుల్లో జాప్యం ఎందుకని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



లింగంపల్లి వద్ద డైవర్షన్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న డైవర్షన్ రోడ్డు పనులను శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలించారు. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్డు కొట్టుకుపోయింది. సెప్టెంబర్ 4న స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించారు. తాత్కాలిక రోడ్డు కోసం రూ. కోటి విడుదల చేశారు. దాంతో డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు. నేటికీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఎమ్మెల్యే.. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పనులు వేగవంతం చేసి రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, బాలకిషన్, వాహబ్, అంజయ్య, సాయిరాం, తదితరులున్నారు.

బోర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి



లక్ష్మీరావులపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

మాచారెడ్డి: రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్తు శాఖ డీఈ కల్యాణ చక్రవర్తి సూచించారు. శనివారం లక్ష్మీరావులపల్లిలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గి విద్యుత్తు ఆదా అవుతుందని తెలిపారు. కెపాసిటర్లు వాడడం వల్ల మోటార్లు కాలిపోకుండా ఉంటాయని వివరించారు. రైతులు మోటార్ల వద్ద విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సొంతంగా ఎలాంటి మరమ్మతులు చేయవద్దని సూచించారు. తమ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని వివరించారు. ఏడీఈ నరేశ్, మాచారెడ్డి ఏఈ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ ఎంతో మేలు



మద్నూర్(జుక్కల్): సోలార్ పవర్ ప్లాంట్ ఎంతో మేలు జరగుతుందని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. మండలంలోని మేనూర్, పెద్ద ఎక్లార గ్రామాల శివారును శనివారం ఆయన సోలార్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్‌ను మేనూర్, పెద్ద ఎక్లారలో ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. యూనిట్ ఏర్పాటుకు ఇక్కడ అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని డీఆర్‌డీవో.. సోలార్ ప్రతినిధులతో పేర్కొన్నారు. డీపీఎం సాయిలు, ఐకేపీ ఏపీఎం జగదీష్, సిబ్బంది ఉన్నారు.

కాలిపోయిన మినీ ట్రాన్స్‌ఫార్మర్

- పట్టించుకోని అధికారులు



మాచారెడ్డి: చుక్కాపూర్‌లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్తును సరఫరా చేసే మినీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడు అడిగినా, స్పందించడం లేదని గ్రామానికి చెందిన రైతు నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్‌ద్వారా సంప్రదిస్తే మాకు తెలియదంటూ దాటవేస్తున్నారని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలిపోయిన మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.

హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): గాంధారి మండల కేంద్రంలో నేడు నిర్వహించే హరీశ్ రావు సభకు బీఆర్‌ఎస్ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నేతలు గన్నూనాయక్, బాలాగౌడ్, బండి నర్సింలు, సాయిరాం, శ్రీకాంత్, జి. నర్సింలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాజాత బృంద సభ్యులు

కామారెడ్డి టౌన్: సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ శాఖ కళాబృందం సభ్యులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, సైబర్ నేరాలు, చిన్నపిల్లలపై నేరాలు, బాల్య వివాహాలు, మహిళలపై దాడులు, సోషల్ మీడియాలో మోసాలపై అవగాహన కల్పించారు. షీటీమ్స్, కళాబృందం సభ్యులు తిరుపతి, ప్రభాకర్, శేషారావు, సౌజన్య, భూమయ్య, భాను, సాయిలు తదితరులున్నారు.

దుర్గామాతకు ఘనంగా వీడ్కోలు

– భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ముగియడంతో కొన్నిచోట్ల శుక్రవారం రాత్రి, మరికొన్ని చోట్ల శనివారం నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. శోభాయాత్రలో మహిళలు దాండియా ఆడుతూ.. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మండపాల నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తరలించి స్థానిక చెరువులలో నిమజ్జనం చేశారు. అంతకు ముందు మండపాల వద్ద లడ్డూ, చీరల వేలంపాటలు నిర్వహించారు. శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



సదాశివనగర్‌లో భజన కీర్తనలతో శోభాయాత్ర



గొల్లపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



నర్వలో దాండియా ఆడుతున్న యువతులు



దేవునిపల్లిలో ..



మాందాపూర్‌లో లడ్డూను అందజేస్తున్న జై భవాని యూత్ సభ్యులు



టేక్రియాల్ చెరువులో..



ఎల్లారెడ్డిలో ..




గాంధారి మండల కేంద్రంలో ..

సంక్షిప్తం

రేపటి నుంచి సిద్ధి సమాధి యోగా కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: స్థానిక అశోక్‌నగర్‌లోని ఎస్‌ఎస్‌వై సెంటర్‌లో రేపటి నుంచి సిద్ధి సమాధి యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతినిధి రమేష్ తెలిపారు. ఆసక్తిగల వారు ఆదివారం సాయంత్రం 6 గంటలకు అరగంట పాటు నిర్వహించే పరిచయ కార్యక్రమంలో పాల్గొని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో శబరిమాత ఆశ్రమానికి సంబంధించి ఆదివారం 36వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. వార్షికోత్సవంలో భాగంగా గీతాపారాయణం, ధ్వజారోహణంతోపాటు శబరిమాత పల్లకీ సేవ జరుపనున్నారు. దీంతోపాటు ఆశ్రమం వద్ద శబరిమాత పాదుకపూజతోపాటు అన్నసంతర్పణ చేపట్టనున్నారు. రాత్రివేళ భజన కార్యక్రమాలు ఉంటాయి.

మలిదశ ఉద్యమకారులను విస్మరిస్తున్న ప్రభుత్వం

బాన్సువాడ: మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరిస్తోందని మలిదశ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్, మండల అధ్యక్షుడు చందు అన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ఉద్యమాలు చేసి జైలు పాలయ్యామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మలిదశ ఉద్యమకారులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి రాగానే ఉద్యమకారులను మరిచిపోయారని విమర్శించారు. మలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రామారెడ్డి: మద్దికుంటలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండి ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కోమటిశాల రాజు, చెన్న రవి, కోమటిశాల నరసింహులు, గరిసే రాజయ్య, గజ్జల మల్లయ్య ఉన్నారు. కార్యక్రమంలో రామారెడ్డి మాజీ జెడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, నాయకులు రవి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.